క్లుప్తంగా

లేఅవుట్ల పరిశీలన



కనిమెరక లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

బొండపల్లి: మండలంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కనిమెరక, దేవుపల్లి, గిట్టుపల్లి, గొల్లుపాలెం, జీ.పి.అగ్రహారం, ఎం.కొ త్తవలసలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లతో పాటు కాలనీలను విజిలెన్స్ అధికారి పురుషోత్తం, హౌసింగ్ అధికారులు బుధవారం పరిశీలించారు. లేఅవుట్లు, కాలనీల్లో లబ్ధిదారులు ఎన్ని గృహాలు నిర్మించారు, ఇళ్ల నిర్మాణాలు ఏయే దశల్లో ఉన్నాయి, ఇంకా ఎంతమంది నిర్మాణాలు ప్రారంభించలేదన్న వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గృహ నిర్మాణశాఖ ఏఈ జి.గంగాధర్, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

గజపతినగరంలో వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ, సిబ్బంది

గజపతినగరం: స్థానిక గ్రామ సచివాలయం–2 పరిధిలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు.వైద్యాధికారి, సిబ్బంది కలిసి శిబిరంలో 64 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. కీళ్లనొప్పులు,జ్వరం, తలనొప్పి, దగ్గు తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అనంతరం గృహసందర్శన చేసి వైద్య శిబిరానికి రాలేకపోయిన వృద్ధులు, బెడ్ రెస్ట్ రోగులకు వైద్య తనిఖీలు చేశారు.

మెగా పేరెంట్స్‌డేను విజయవంతం చేయండి

వేపాడ: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న మెగా పేరెంట్స్‌డే సమావేశాలను విజయవంతం చేయాలని హెచ్‌ఎంలకు ఎంఈఓలు జగదీశ్వరరావు, బాలభాస్కరరావు కోరారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం హెచ్‌ఎంలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ సమావేశాల విజయవంతానికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అపార్ నమోదు ప్రక్రియను శతశాతం పూర్తి చేయాలని సూచించారు.సీఆర్పీలు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఏఈగా సతీష్

బొండపల్లి: మండల ఇరిగేషన్ ఏఈగా పల్లా వెంకట సతీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాడేరు నుంచి బదిలీ పై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇదివరకు పనిచేసిన ఆవాల సూరీడుకు విజయనగరం బదిలీ అయ్యింది. మండలంలో ఇరిగేషన్ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఏఈ వెంకట సతీష్ తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



కేజీబీవీ ఉపాధ్యాయినులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ జీసీడీఓ భారతి

గంట్యాడ: స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయినులు కృషి చేయాలని అసిస్టెంట్ జీసీడీఓ భారతి అన్నారు. స్థానిక కేజీబీవీని బుధవారం ఆమె సందర్శించారు. 10వతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినులతో మాట్లాడి పబ్లిక్ పరీక్షల సమయం దగ్గరపడుతోందని, సమయాన్ని వృథా చేయకుండా శ్రద్ధగా చదువుకోవాలని చెప్పారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందేలా చూసుకోవాలని ఎస్‌ఓ అల్లుజ్యోతికి సూచించారు.

7న మండల సర్వసభ్య సమావేశం

లక్కవరపుకోట: మండల సర్వసభ్య సమావేశం ఈనెల7వ తేదీన ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించను న్నారని ఎంపీడీఓ ఎస్.అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి మండల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కోవాలని కోరారు.

నేటి నుంచి మార్గశిర మాసోత్సవాలు

వేపాడ: బొద్దాంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం నుంచి మార్గశిర మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. నాలుగు గురువారాలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 5వ తేదీ, 12, 19, 26వ తేదీల్లో అర్చకులు బొడ్డపాటి హరిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేయనున్నామని వివరించారు. ఆఖరి గురువారం 26న అన్నదానం నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గాడితప్పిన సచివాలయ వ్యవస్థ



మరడాం గ్రామ సచివాలయం

- సచివాలయ వ్యవస్థపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- సేవలను కుదించి నిర్వీర్యం చేసే ఎత్తుగడ
- కూటమి పాలనతో ప్రజలకు అవస్థలు

దత్తిరాజేరు: మహాత్మా గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాకారానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో కృషి చేసింది. ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ వారి ఇంటి ముంగిటకే అందించాలనే లక్ష్యంతో దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారు. 2 వేల జనాభాకు ఒకటి చొప్పు న సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. నూతన భవనాలను నిర్మించడంతో పాటు వ్యవసాయ, పశు సంవర్ధక, విద్య, వైద్య, పరిపాలన శాఖలకు సంబంధించిన అన్ని రకాల సేవలను గ్రామాల్లోనే అందించేలా 10 నుంచి 12 మంది ఉద్యోగులను నియమించారు. వీరంతా సచివాలయాల్లో ఉంటూ ప్రజలకు అవసరమైన సేవలతో పాటు సకాలంలో జనన, మరణ, ఆదాయ, నివాస, కులధ్రువీకరణ పత్రాలతో పాటు 500లకు పైగా సేవ లందించేవారు. ఈసిబ్బందికి తోడు ప్రతీ 50 కుటుంబాలకు ఒక గ్రామ వలంటీర్ ను నియమించారు. ఈ వలంటీర్ వ్యవస్థను సచివాలయ వ్యవస్థకు అనుసంధానం చేశారు. దీంతో పాలన గ్రామస్థాయికి వికేంద్రీకరణ జరిగింది. ప్రజలకు ప్రభుత్వసేవలన్నీ అందడంతో పాటు పథకాల కోసం దరఖాస్తుల స్వీకరణ, అర్హుల ఎంపిక ప్రక్రియ సచివాలయాల ద్వారానే జరిగేది. అయితే రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సచివాలయ వ్యవస్థ క్రమక్రమంగా నిర్వీర్యమవుతూ వస్తోంది.ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను లేకుండా చేశారు. ప్రజలకు ఇంటి వద్ద అందే సేవలు ప్రైవేట్ నెట్‌వర్క్‌లకు, ఏజెన్సీలకు అప్పగించేశారు. సచివాలయాల్లో సేవలను 500 నుంచి 370కు కుదించేశారు.

గజపతినగరం నియోజకవర్గంలో సచివాలయాల సంఖ్య	
మండలం	సచివాలయాలు
దత్తిరాజేరు	17
గజపతినగరం	21
గంట్యాడ	22
బొండపల్లి	17

మళ్లీ మండల కేంద్రాలు.. నెట్ సెంటర్ల చుట్టూ ప్రదక్షిణలు

సచివాలయ వ్యవస్థ ఏర్పాటుకు ముందు వరకు ప్రజలు, కుల, ఆదాయ, జనన, మరణ, నివాస తదితర ధ్రువీకరణ పత్రాలతో పాటు ఏ చిన్న ప్రభుత్వ సేవ కోసమైనా మండల కేంద్రాల్లోని కార్యాలయాలు, మీసేవ కేంద్రాలు, నెట్ సెంటర్లకు వెళ్లాల్సి వచ్చేది. కొంతమంది నిరక్షరాస్యులకు ఏ కార్యాలయానికి వెళ్తే తమకు కావాల్సిన ధ్రువపత్రాలు వస్తాయో, ఎక్కడ పనిజరుగుతుందో కూడా తెలియక మండల కేంద్రాల్లోని కార్యాలయాల చుట్టూ ప్రద క్షిణలు చేసేవారు. కూలి, వ్యవసాయ పనులు మానుకోవాల్సి వచ్చేది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ పరిస్థితికి చెక్ పడింది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సేవలన్నీ ఇంటి ముంగిటకే అందేవి.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను నిర్లక్ష్యం చేయడంతో మళ్లీ పాతరోజులు వచ్చేశాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు..



గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన నాటి నుంచి ప్రజలకు అన్ని రకాల సేవలూ ఉన్న ఊరిలోనే అందుతుండేవి. మాకు ఏదైనా ధ్రువీకరణ పత్రం కావాలంటే వలంటీర్‌కు చెబితే వారే దగ్గరుండి సచివాలయానికి తీసుకువెళ్లి పని పూర్తి చేసేవారు. పథకాల కోసం కూడా మండల అధికారుల వద్దకు వెళ్లాల్సిన పని ఉండేది కాదు. ఇప్పుడు సచివాలయాల్లో ఏ పనులూ జరగడం లేదు.ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– సుమల శ్రీను, పాపయ్యవలస, దత్తిరాజేరు

నీరుగార్చడం సరికాదు



సచివాలయ వ్యవస్థను నీరుగార్చాలని చూడడం సరికాదు. ప్రజలకు మేలు చేసే వ్యవస్థను ఏ ప్రభుత్వం ప్రవేశపెట్టినా, తర్వాత వచ్చే ప్రభుత్వాలు వాటిని కొనసాగించాలి. గతంలో సచివాలయంలో చాలా రకాలు సేవలు అందేవి. ప్రస్తుతం కొన్ని శాఖలకు సంబంధించిన పనులు సచివాలయంలో జరగడం లేదు. మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. సచివాలయాల్లో అన్ని సేవలూ అందుబాటులోకి తీసుకురావాలి.

– కొల్లి తిరుపతి, ఇంగిలాపల్లి, దత్తిరాజేరు

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



జామి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

శృంగవరపుకోట: చాలీచాలని వేతనాలు కుటుంబాలను నెట్టుకురాలేకపోతున్నామంటూ పలువురు పారిశుద్ధ్య కార్మికులు జామి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, పారిశుద్ధ్య కార్మికుల సంఘ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ నేతృత్వంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కె.సురేష్, మద్దిల రమణ మాట్లాడుతూ, కార్మికులకు వేతనాలు పెంచడంతో పాటు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రీన్ అంబాసిడర్లను కేంద్రం అధీనంలో కొనసాగించాలని నినదించారు. అనంతరం వినతిపత్రాన్ని ఎంపీడీఓ అప్పలనాయుడుకు అందజేశారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



వెంకట్రామా పొల్ట్రీస్ పరిశ్రమ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులు

చీపురుపల్లి: మండలంలోని కర్లాం వద్ద ఉన్న వెంకట్రామా పొల్ట్రీస్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని, కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు నిరసనలు తెలుపుతామని సీఐటీ యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.గౌరునాయుడు స్పష్టం చేశారు. పరిశ్రమ ప్రధాన గేటు ఎదుట కార్మికులు బుధవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట్రామా పొల్ట్రీస్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు యాజ మాన్యం అన్యాయం చేస్తోందన్నారు. 2024 జూన్ నెలలోనే వేతన ఒప్పందం జరగాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్య ధోరణితో ఇంతవరకు అమలుకాలేదన్నారు. పలుమార్లు కార్మికశాఖ అధికారుల వద్ద చర్చలు జరిగినప్పటికీ ఎలాంటి ప్రయో జనం లేకుండా పోయిందన్నారు. విశాఖపట్నంలో ఈనెల 3వ తేదీన కార్మికశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన చర్చలు కూడా విఫలయ్యాయన్నారు. అందుకే రిలే నిరాహార దీక్షల ద్వారా ఉద్యమాన్ని ప్రారంభించామని చెప్పారు.

జనవరిలో జూట్ మిల్లు తెరిచే అవకాశం

- కార్మిక సంఘ నాయకుడు గణేష్ పండా



జేసీఎల్ కార్యాలయంలో జరిగిన చర్చలో పాల్గొన్న యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘ నాయకులు

కొత్తవలస: మండలంలోని కోటపాడు రోడ్డులో గల ఉమా జూట్ మిల్లును జనవరి నెలలో తెరిచేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందని కార్మిక సంఘ నాయకుడు గణేష్ పండా తెలిపారు. ముడిసరుకు కొరత, మిల్లులో తయారైన సరుకు మార్కెట్‌లో అమ్ముడు పోలేదని నెపంతో ఎటువంటి నోటీస్ లేకుండా ఈ ఏడాది మే నెలలో మిల్లు మూసివేసిన విషయం తెలిసిందే. దీంతో కార్మికులు పలుమార్లు ఆందోళన చేపట్టగా..పలుమార్లు ఏసీఎల్, జేసీఎల్ వద్ద తొమ్మిదిసార్లు చర్చలు జరిగాయి. అయితే ఇన్నాళ్లూ యాజమాన్యం ఒక్కసారి కూడా హాజరు కాలేదు. విశాఖపట్నంలోని జేసీఎల్ కార్యాలయంలో బుధవారం జరిగిన చర్చల్లో మిల్లు మేనేజింగ్ పార్టనర్లు టి.సుబ్బారావు, టి.సప్తగిరి హాజరై జనవరిలో మిల్లు తెరిచేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కార్మిక సంఘ నాయకుడు మాట్లాడుతూ, కార్మికులు చిత్తశుద్ధితో పనిచేసి మిల్లు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. చర్చలో కార్మిక సంఘ నాయకులు కె.శ్రీను, కె.ఈశ్వరరావు, ఎస్.గోవింద, ఎస్.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేవీ డే



నౌకాదళం విశిష్టతను వివరిస్తున్న వక్తలు

శృంగవరపుకోట : పట్టణంలోని పుణ్యగిరి గ్రామంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత నౌకాదళ దినోత్సవం (నేవీ డే) బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నేతృత్వం వహించిన ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ షేక్ వలీఖాన్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా డిసెంబర్ 4న భారత ప్రభుత్వం నావికాదళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోందన్నారు. భారతదేశ నావికాదళం ప్రజ్ఞా పాటవాలు, గత విజయాలు, భారతదేశ రక్షణ వ్యవస్థలో నావికాదళం పోషిస్తున్న పాత్రను వివరించారు. మరాఠా చక్రవర్తి ఛత్రపతి శివాజీ భారత నౌకాదళ పితామహుడని తెలిపారు అన్నారు. అతిథిగా హాజరైన సబ్బవరం కళాశాల లెక్చరర్ ఎం.గోవిందరావు మాట్లాడుతూ.. భారత నావికాదళానికి సర్వసైన్యాధ్యక్షునిగా రాష్ట్రపతి వ్యవహరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. హాజరయ్యారు.

సామర్థ్యాలను పరీక్షించేందుకే సర్వేక్షణ్ పరీక్ష



చీపురుపల్లి: బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ, డైట్ లెక్చరర్



కొత్తవలస: జ్ఞానోదయ పాఠశాలలో పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

చీపురుపల్లి: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పరీక్షించేందుకేరాష్ట్రీయ సర్వేక్షణ్(పరఖ్) పరీక్షలను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంఈఓ ఎం.బ్రాసినాయుడు చెప్పా రు. ఈపరీక్ష నిర్వహణకు మండలంలోని చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాల, మెట్టపల్లి, కర్లాం, పెదన డిపల్లి ఉన్నత పాఠశాలలతో పాటు జి.ములగాం ప్రాథ మికోన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో 3,6, 9వ తరగ తుల విద్యార్థులకు గణితం, సైన్స్,సాంఘిక శాస్త్రం సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓ చెప్పారు. పరీక్షల నిర్వహణను డైట్ లెక్చరర్ ఎల్.రామకృష్ణతో కలిసి ఆయన పరిశీలించారు. వారి వెంట సీఆర్పీ కంది రామకృష్ణ ఉన్నారు.

పరిశీలన

కొత్తవలస: స్థానిక దాబాల సమీపంలోని జ్ఞానోదయ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు బుధవారం నిర్వహించిన రాష్ట్రీయ సర్వేక్షణ్(పరఖ్) పరీక్షలను ఎంఈఓ జి.శ్రీదేవి పరిశీలించారు. పరీక్షలకు పరిశీలకులుగా జవహర్ నవోదయ పాఠశాల ఉపాధ్యాయుడు కె.సురేంద్ర వ్యవహరించారు.

సోంపురంలో..

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు బుధవారం రాష్ట్రీయ సర్వేక్షణ్(పరఖ్) పరీక్షలు నిర్వహించారు. ఎంఈఓ – 2 బాలభాస్కరరావు, పరీక్షల పరిశీలకులు రఘు, ఫీల్డ్ ఇన్విజలేటర్ సీహెచ్ పుష్ప పరీక్షల నిర్వహణను పరిశీలించారు. వారి వెంట సీఆర్పీ రాంప్రసాద్ ఉన్నారు.

6న మెగాజాబ్ మేళా

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు బుధవారం ఓ ప్రకటన లో తెలిపారు.18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న 10వ తరగతి నుంచి పీజీ విద్యార్హత ఉన్న వా రు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ విద్యార్హత, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తీసుకుని కళాశాలలోని సెమినార్ హాల్‌లో ఉదయం 9 గంటల కు హాజరు కావాలని స్పష్టం చేశారు. వివరాలకు 79956 91295 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

భూసమస్యలు పరిష్కరించండి

చీపురుపల్లి: భూరీసర్వేలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన పొరపాట్లను సరి చేసి రైతులు ఎదు ర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రామలింగా పురం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రామలింగాపురం లో భూరీసర్వే చేసిన తర్వాత ఉత్పన్నమైన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అక్టోబర్ 22న రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారని గుర్తు చేశారు. ఆ గ్రామసభలో రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారని కానీ ఇంతవరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు గ్రామ సందర్శన

దత్తిరాజేరు: మండలంలోని కె.కొత్తవలసలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు గ్రామంలో పర్య టించి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, అక్కడి సదుపాయాలు, సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారులకు తెలియజేయవచ్చని తెలిపారు.

కార్మిక సంఘ నాయకులతో చర్చలు

మెరకముడిదాం: గర్భాం గ్రామంలోని ఆంధ్రా ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ మూతపడి ఆరేళ్లు అయినా ఇంతవరకూ తెరుచుకోకపోవడంపై ఈనెల 2 వతేదీన 'పరిశ్రమ తెరుచుకునేదెప్పుడో' అనే శీర్షికతో సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కె.శ్రీదేవి స్పందించారు. ఆమె ఆధ్వ ర్యంలో కార్మిక సంఘ నాయకులు, పరిశ్రమ యాజమాన్యం ప్రతినిధులతో విశాఖపట్నంలో ఈనెల 3వతేదీ రాత్రి చర్చలు జరిగాయి. 2025 జనవరిలో పరిశ్రమను తెరవాలని కార్మిక సంఘ నాయకులు కోరగా..ఏప్రిల్‌లో పరిశ్రమను తెరుస్తామని యాజమాన్యం ప్రతినిధులు తెలిపారు. అయితే అంతవరకూ పెండింగ్ వేతనాలు గ్రాట్యుటీ అడగబోమని కార్మికులను అగ్రిమెంట్ రాసివ్వాలని యాజమాన్యం పట్టుబట్టింది. దానికి కార్మిక సంఘం నాయకులు ఒప్పుకోకపోవడంతో చర్చలను జాయింట్ లేబర్ కమిషనర్ శ్రీదేవి ఈనెల 11వ తేదీకి వాయిదా వేశారు.

సత్కారం



వచన కవిత్వం, గేయక విత్వాల ద్వారా దశాబ్దాలుగా ప్రజలను చైతన్యపరుస్తున్న చీపురుపల్లి మండలంలోని రావివలస గ్రామానికి చెందిన గంటాన అప్పారావు ప్రజాయుద్ధనౌక గద్దర్ జాతీయ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 12న పి.గన్నవరంలోమమత స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్, గద్దర్ కుమార్తె వెన్నెల గద్దర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ అవార్డు ఎంపిక కమిటీ ఉత్తరాంధ్ర కన్వీనర్ ఆతవ భాస్కరరావు ఆధ్వర్యంలో అప్పారావును సత్కరించారు. దళిత సంఘాల నాయకులు టొంపల సంజీవరావు, దీనుపల్లి రాము, అడ్డూరి కృష్ణ, రేగిడి రామకృష్ణ పాల్గొన్నారు. – చీపురుపల్లి

ఘనంగా ఘంటశాల జయంతి



అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి వేడుకలను సహాయ్‌స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గరివిడిలోని టీచర్స్ కాలనీ వద్ద ఉన్న సహాయ్ పార్క్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఘంటశాల విగ్రహానికి జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఎస్ఎంఎస్ ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమ డైరెక్టర్ వాకాడ గోపి,సహాయ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీను పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ డిసెంబర్–29న గరివిడిలోని సీతారామ కల్యాణ మండపంలో 30 మంది గాయనీ, గాయకులతో నాడు–నేడు పేరిట సంగీత విభావరి నిర్వహించనున్నట్లు తెలిపారు. కొండపాలెం ఉపసర్పంచ్ బమ్మిడి కార్తీక్, స్థానిక నాయకులు, ఘంటశాల అభిమానులు పి.ప్రమీలకుమార్, గణేశ్వరరావు, సత్యశ్రీను, సివుకు కాంతారావు, సరిది రాంబాబు,రమణ,శంకర్,కిరణ్ పాల్గొన్నారు.

– చీపురుపల్లిరూరల్(గరివిడి)

రాస్తారోకో..



విద్యుత్ ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలను దోచుకోవడం తగదని సీపీఎం నాయకుడు గాడి అప్పారావు అన్నారు. పెంచిన చార్జీలకు నిరసనగా.. కొత్తవలస మండల కేంద్రంలోని మూడురోడ్ల జంక్షన్‌లో సీఐటీయూ నాయకులతో కలిసి బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే రెండోసారి విద్యుత్ చార్జీలను పెంచిందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే చార్జీలను తగ్గించకపోతే పోరాట ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

– కొత్తవలస

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

శృంగవరపుకోట: గ్రామాల్లో రైతుల భూసమస్యల పరిష్కారం కోసం ఈనెల 6వ తేదీ నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులను నిర్వహించ నున్నట్లు తహసీల్దార్ అరుణకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రోజుకు రెండు పంచాయతీల్లో సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సంబంధిత షెడ్యూల్‌ను విడుదల చేశా రు. డిసెం బర్ 6న ఉదయం మరుపల్లి, మధ్యాహ్నం కాపుసోంపురం, 7న మూలబొడ్డవర, 9న ఉదయం ఆలుగుబిల్లి, మధ్యాహ్నం కొత్తకోట, 10న ఉదయం కొ ట్టాం, 11న ఉదయం ముషిడిపల్లి, 12న ఎస్.కోట, 13న ధారపర్తి, 16న భర్తాపురం, 17న ధర్మవరం, 18న తిమిడి, 19న కొత్తూరు, 20న మామిడిపల్లి, 21న పోత నాపల్లి, 23న గోపాలపల్లి, 24న సీతారాంపురం, 26న మల్లిపూడి, 27న ధాంపురం, కాశీపతిరాజపురం, 28న ఆలుగుబిల్లి, 30న ఎస్.కోట తలారి, 31న ఉదయం ఎస్.జి.పేట, మధ్యాహ్నం వినాయకపల్లి, జనవరి 2న ముషిడిపల్లి, 3న భర్తాపురం, 4న పెదఖండేపల్లి, 6న వీరనారాయణం, 7న కొట్టాం, 8న ఎం.బి.వర గ్రామా ల్లో సదస్సులు నిర్వహిస్తామని, రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెరకముడిదాం మండలంలో..

మెరకముడిదాం: మండలంలో ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకూ రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అజూరఫీజాన్ బుధ వారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా గ్రామసభల్లో వినతిపత్రాలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

కావాలనే ఆయాను తొలగించారు..

- అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ గజపతినగరం ప్రాజెక్ట్ కార్యదర్శి జ్యోతి



మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పి.జ్యోతి, తదితరులు

గజపతినగరం: మండలంలోని రామన్నపేట అంగన్‌వాడీ ఆయా మానాపురం సౌజన్యను కేవలం రాజకీయ దురుద్దేశంతోనే తొలగించారని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ గజపతినగరం ప్రాజెక్ట్ కార్యదర్శి పి. జ్యోతి అన్నారు. పురిటిపెంటలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ గ్రామానికి చెందిన సర్పంచ్‌తో పాటు పలువురు అధికారులు ఆమె తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగం పొందిందని ఆరోపిస్తూ తొలగించారన్నారు. సోమవారం నాటికి ఆమెను విధుల్లోకి తీసుకోకపోతే ఆ రోజు నుంచే రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. అ ప్పటికీ స్పందించకపోతే గురువారం నుంచి పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎం.సుభాషిని, సీఐటీ యూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి, మత్యాలమ్మ, సౌజన్య, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.